క్లుప్తంగా

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు



గాజులదిన్నె ప్రాజెక్టు స్టేజ్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ గంగాధర్

గోనెగండ్ల: మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని సీఐ గంగాధర్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసులు గాజులదిన్నె ప్రాజెక్టు స్టేజ్ వద్ద ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేని వారికీ ఎంవీ కేసులు బుక్ చేసినట్లు తెలిపారు. అలాగే మద్యం సేవించి వాహనం నడిపిన వారికి, డ్రైవింగ్ లైసెన్స్ లేని 10 మందికి చలానా విధించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత

గోనెగండ్ల : స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ శాఖ సిబ్బందికి బుధవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత మాట్లాడుతూ ప్రతి అధికారిలో పారదర్శకత, జవాబు దారితనం తీసుకురావడం కోసం సమాచార హక్కు చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. అర్జీదారుడు అడిగిన సమాచారాన్ని కార్యాలయంలో ఉన్న రికార్డుల మేరకు 30 రోజుల లోపు ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు షఫీ, మహేంద్ర పాల్గొన్నారు.

వంద పని దినాలు పూర్తి చేయండి

నందవరం : ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీల 100 పని దినాల యాక్షన్ ప్లాన్ పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లను ఎంపీడీఓ పుల్లయ్య ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో ఉపాధి పనులపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వలసల నివారణకు పల్లెల్లో పనులు గుర్తించి, ఉపాధి పనులను తప్పని సరి ప్రారంభించాలన్నారు. అలాగే ఉద్యాన పంటలైన పండ్ల తోటలు, పూల తోటల పెంపకాలపై దృష్టి సారించాల్నారు. పండ్ల తోటలు, పూల తోటలు సాగు చేసిన రైతులకు ప్రభుత్వ ప్రోత్సహకాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి



సచివాలయ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

కోసిగి: శ్మశాన వాటికలో వృత్తి నిర్వహించే కాటికాపరిలను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కేవీపీఎస్ నాయకులు హనుమంతు, కాటికాపరుల సంఘం నాయకుడు ఫిలిప్ కోరారు. బుధవారం కోసిగి మండలంలోని కందుకూరు, కామన్‌దొడ్డి, సాతనూరు కొట్టాల, పెద్దభూంపల్లి, చిన్నభూంపల్లి, ఐరన్‌గల్లు, జంపాపురం, జుమ్మాలదిన్నె, గొడగల్లు, కోసిగిలలో కేవీపీఎస్, కాటకాపరుల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపి సచివాలయాలంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జీఓ నంబర్1235 ప్రకారం కాటికాపరులకు రెండెకరాల ప్రభుత్వ స్థలం ఏర్పాటు చేయాలని, ఉచిత ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరసన్న, అంజి, ముగ్గురన్న, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి



నరసమ్మను పరామర్శిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆదోని అర్బన్: పారిశుద్ధ్య కార్మికురాలు నర్సమ్మపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు డిమాండ్ చేశారు. దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరసమ్మను బుధవారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ డ్యూటీలో ఉన్న పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడి చేయడం బాధాకరమన్నారు. పారిశుద్ధ్య కార్మికులపై దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, భీమేష్, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ఎస్.జాన్‌బాబు ఉన్నారు.

కొనసాగించేరా?

- అమలు కాని ఎన్నికల హామీ
- నాలుగు నెలలుగా వలంటీర్లను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- గౌరవ వేతనాలు సైతం ఇవ్వని వైనం
- వైఎస్సార్‌సీపీ హయాంలో 50 ఇళ్లకు ఓ వలంటీర్
- ప్రతినెలా రూ.5వేల గౌరవవేతనం



పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీరు (ఫైల్)

ఆదోని సెంట్రల్: తాము అధికారంలోకి వస్తే వలంటీర్లను తొలగించమని, వారి సేవలను కొనసాగిస్తామని, గౌరవ వేతన రూ.10వేలకు పెంచుతామని ఎన్నికల ముందు కూటమి హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ల సమస్యను ఎటూ తేల్చడంలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన పుటి నుంచి వారి సేవలను సైతం వినియోగించుకోవడంలేదు. వేతనాలు కూడా ఇవ్వడంలేదు. దీంతో అసలు వారిని కొనసాగిస్తారో లేదో తెలియని పరిస్థితి. దీంతో వలంటీర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రజలకు విశేష సేవలు..

2019 వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి, వలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి విశేష సేవలను అందించారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడం మొదలు కొని ఎప్పటికప్పుడు ప్రజలకు ఏఏ పథకాలు ఎప్పుడు వస్తాయి, అధార్ కార్డు అప్‌డేట్లు, సర్టిఫికెట్లు, ఆరోగ్యశ్రీ సేవలు, ఆరోగ్య శిబిరాలు, చిన్న పిల్లలకు వేసే వ్యాక్సిన్లు ఇలా అన్ని రకాల సమాచారాన్ని ప్రజలకు చేరవేసేవారు. వలంటీర్లు ద్వారా ఇళ్ల వద్దకే పథకాలన్ని అందేవి. కరోనా కష్టకాలంలో ఇంటింటికీ విశేష సేవలందించారు.

సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీ

ఆదోని నియోజకవర్గంలో గ్రామీణ, పట్టణ ప్రాంతంలో 12వేల మంది వలంటీర్లు గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే వారు. ప్రభుత్వం అందించే రూ. 5వేల గౌరవ వేతనంతో జీవన భృతి పొందే వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ల పక్కన పెట్టి, సచివాలయ ఉద్యోగుల ద్వారానే పింఛన్లను పంపిణీ చేయిస్తోంది. ఎన్నికల ముందు వలంటీర్లకు గౌరవ వేతనం రూ.10వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత దానిని అమలు చేయడం లేదు. అసలు వలంటీర్లను కొనసాగిస్తారో లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు వలంటీర్ వ్యవస్థపై అతిగతీ లేదు. నాలులు నెలలుగా వారి సేవలను వినియోగించుకోవడంలేదు. పైగా వేతనాలు సైతం ఇవ్వడంలేదు. ఎన్నికల ప్రక్రియ కొనసాగిన మూడు నెలల కాలానికి సంబంధించిన వేతనాలు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. తమను విధుల్లోకి తీసుకుంటారేమోనని వలంటీర్లు ఆశతో ఎదురు చూస్తూ ఉన్నారు.

విధుల్లోకి తీసుకోవాలి



ప్రజలకు ఎన్నో సేవలను అందించాం. మమ్ములను విధుల్లోకి తీసుకుని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలి. ఇచ్చిన మాట ప్రకారం గౌరవ వేతనం రూ. 10వేలు అందించేలా చర్యలు చేపట్టాలి. వలంటీర్ల వ్యవస్థ కొనసాగింపుపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుని కొనసాగిస్తే బాగుంటుంది.

– పరుశురాముడు, వలంటీర్

న్యాయం చేయాలి



వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉండి అనేక రకాల సేవలను అందించారు. ప్రభుత్వం వారు చేసిన సేవలను గురించాలి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేసి వలంటీర్ల వ్యవస్థను యాథావిధిగా కొనసాగించాలి. గత నాలుగైదు నెలలుగా జీతాలు లేక, విధులు లేక సందిగ్ధంలో ఉన్నారు. ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకొని వలింటీర్లకు న్యాయం చేయాలి.

– డి.లక్ష్మన్న సీపీఎం. పట్టణ కార్యదర్శి

స్కూల్ కాంప్లెక్స్ పకడ్బందీగా నిర్వహించాలి

కోసిగి: మండల కేంద్రం కోసిగి బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈఓ–2 శోభారాణి, మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ప్రవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆన్‌లైన్ వెబ్ ఎక్స్‌లో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ విజయరామరాజు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్‌లు పకడ్బందీగా నిర్వహించేలా రీవెరిఫికేషన్ చేయాలని సూచించారు. అలాగే విద్యార్థులకు ఎఫ్ఏ–1, ఎఫ్–2 పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. హెచ్‌ఎంలు ఖలీల్ అహ్మద్, నాగేశ్వరి, దేవి, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభాస్ జన్మదిన వేడుకలు

ఆదోని అర్బన్: పట్టణంలో బుధవారం ప్రభాస్ యువసేన ఫ్యాన్స్ ఆధ్వర్యంలో రెబల్ స్టార్ ప్రభాస్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక అన్నా క్యాంటీన్‌లో ప్రభుత్వానికి చలానా కట్టి ప్రజలకు ఉచితంగా ఒక్కపూట భోజనాన్ని అందించారు. ప్రభాస్ ఫ్యాన్స్ బుద్దారెడ్డి, గోపి, శివ, రవి, షేక్షా, సుదీర్, వినోద్, ప్రసాద్, శ్రీకాంత్, గిరి తదితరులు కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి



అధికారులతో సమావేశమైన సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. గతంలో జరిగిన రోడ్డు సేఫ్టీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల గురించి ఆరా తీశారు. డివిజన్ పరిధిలో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణించే వాహనాలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. నూతన ట్రాఫిక్ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి, రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే స్పందించి వారిని ఆస్పత్రికి తీసుకెళ్లే సమయం జీరో అవర్/గోల్డెన్ అవర్ వాటి ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి కె.వసుంధర, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఆర్డీఓ నాగేంద్ర, ఎంవీఐ సిసిరాదీప్తి, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లల్లో చేరండి



మాట్లాడుతున్న మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ

ఆదోనిటౌన్: లబ్ధిదారులు టిడ్కో ఇళ్లల్లో చేరాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ సూచించారు. ఇళ్లలో చేరి సమస్యలను గుర్తించి తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. బుధవారం టిడ్కో సముదాయం వద్ద సమస్యలపై లబ్ధిదారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఇళ్లల్లో చేరేందుకు ప్రధానంగా తాగునీటి వసతి, భవనాసు లీకేజీ అవుతున్నాయని లబ్ధిదారులు తమదృష్టికి తీసుకొచ్చారన్నారు. అయితే వాటిని వీలైనంత త్వరగానే పరిష్కరిస్తామని, దీపావళి నాటికి లబ్ధిదారులు అందరూ ఇళ్లల్లో చేరి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో పెరిగిపోయిన ముళ్లకంపలు, చెత్తచెదారం తొలగించి పరిశుభ్రం చేస్తామన్నారు. ఇదిలా ఉండగా తమకు గతంలో ఇళ్లు మంజూరయ్యిందని, అయితే నేడు తమ ఇల్లు ఎక్కడుందో, ఏ అంతస్తులో ఉందో చూపాలని సంబంధిత అధికారులను లబ్ధిదారులు కోరారు. ఇల్లు మంజూరైన రశీదు ఉన్న వారికి ఇంటిని చూపుతామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోయ శాంత, టిడ్కో అధికారి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

కోసిగి: భూ సమస్యలు ఉంటే గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభలలో అర్జీలు పెట్టుకుని పరిష్కరించుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. బుధవారం కోసిగిలోని కడపాశెం చౌడేశ్వరి దేవి ఆలయ కళ్యాణ మండపంలో పెండేకల్లు భూముల రీసర్వే పై తహసీల్దార్ నిత్యానందరాజు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. సబ్ కలెక్టర్ హాజరై పెండేకల్లు భూముల వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఆయన వివిధ రకాల భూ సమస్యలు, మార్పులు చేర్పులు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. పెండేకల్లు పరిధిలో 1423.16 ఎకరాలు భూములు ఉండగా ఎల్‌పీఎం నంబర్లు 455 మంది ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, ఆర్ఐలు తిక్కస్వామి, శ్రీరాములు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పూలచింతలో గ్రామసభ

నందవరం: రైతులు రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని రీసర్వే డీటీ మహేష్, ఆర్ఐ జెర్మియా సూచించారు. బుధవారం మండల పరిధిలోని పూలచిం గ్రామంలో రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా 37 అర్జీలు రైతులు సమర్పించారన్నారు. అర్జీలను రెండు వారాల్లో పరిష్కరిస్తామని అధికారులు వివరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అక్బర్‌బాషా, గ్రామ సర్వేయర్ శేఖర్, వీఆర్వో రాఘవేంద్ర పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీపీ టీ. నసురుద్దీన్

గోనెగండ్ల : గ్రామాల్లో ఎప్పటికప్పుడు పరిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ మణి మంజరి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ టి. నసురుద్దీన్ అధ్యక్షతన బుధవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ మండలంలోని హెచ్. కైరవాడి, వేముగోడు, ఒంటెదుదిన్నె, పెద్దమరివీడు గ్రామాల్లో డెంగీ కేసులు నమోదు అయ్యాయన్నారు. ఆ గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించి కేసు నమోదైన ప్రాంతాల్లో ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే మండలంలో టీబీ కేసులు ఎక్కువగా ఉన్నాయని, బాధితులందరికీ చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఫ్రైడే డ్రైడేను వైద్య సిబ్బంది పక్కగా అమలు చేయాలని సూచించారు. ఫివర్ సర్వే పక్కగా చేయాలని, అందులో ఏ వ్యాధి సంబంధించిన కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయో చెప్పాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్ అధికారులు, వైద్య సిబ్బంది సమన్వయంతో అన్ని గ్రామాల్లో వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చొరవ తీసుకొని సమస్యల పరిష్కారనికి కృషి చేయాలన్నారు. అలాగే ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనంత సేన, వైస్ ఎంపీపీ అలువాల వెంకట్రామి రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నర్సింగ్‌హోమ్‌పై చర్యలు తీసుకోవాలి



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ

ఆదోని అర్బన్/సెంట్రల్: పట్టణంలోని వంశీ చైతన్య ప్రయివేట్ నర్సింగ్ హోమ్ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ ఆరోపించారు. బుధవారం నర్సింగ్ హోమ్‌ను కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ, టీడీపీ నాయకుడు ఉమ్మిసలీం మాట్లాడుతూ ఆస్పత్రిలో లింగనిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని ఫిర్యాదులు రావడంతో వచ్చి పరిశీలించామన్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు అపరిశుభ్రంగా ఉన్న గదులను కేటాయిస్తున్నారన్నారు. రోడ్డుపైనే కట్టడం ఉందని, ఆస్పత్రికి డ్రైనేజీ వ్యవస్థ కూడా సరిగా లేదన్నారు. అనంతరం కూటమి నాయకులు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర అనుపమకు ఫిర్యాదు పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి నరసింహలు, నాయకులు పులిరాజు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కక్షసాధింపుతోనే..

ఆదోని సెంట్రల్: కూటమి నాయకులు వంశీ చైతన్య ఆసుపత్రికి చందా కోసం వచ్చారనుకున్న.. కక్ష సాధింపు అని తెలియలేదని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రమేష్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి నాయకులు కండువాలు ధరించి తమ ఆసుపత్రికి వెళ్లి సిబ్బందిని, పేషంట్లను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఆసుపత్రి యాజమాన్యం అనుమతులు లేకుండా మహిళలు, చిన్నపిల్లలు ఉండే వార్డులలోకి ఎలా వెళతారని ప్రశ్నించారు. మీరు చేసే అక్రమాలను ఎండగడితే మా గొంతు నొక్కడానికి ఇలా ప్రవర్తిస్తారా? అంటూ ప్రశ్నించారు. కూటమి నాయకులు ఆసుపత్రిలోని పేషంట్లుకు క్షమాపణ చెప్పాలని కోరారు.

రైతు సమస్యలు పరిష్కరించడంలో విఫలం

పెద్దకడబూరు: రైతు సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు విమర్శించారు. బుధవారం పెద్దకడబూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. మిర్చి రైతులు లక్షల పెట్టుబడి పెట్టి సాగు చేసుకున్నా మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక పోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. రైతులను విస్మరిస్తే కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో తిక్కన్న, బీకేఎంయూ మండల కార్యదర్శి కుమ్మరి చంద్ర, లక్ష్మన్న, వీరేష్, నాగరాజు, గూడుకాజా తదితరులు పాల్గొన్నారు.

చెత్తబుట్టల పంపిణీ



వ్యాపారికి చెత్తబుట్ట అందజేస్తున్న మెప్మా సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో పర్యావరణ పరిరక్షణలో పట్టణ వాసులు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా బుధవారం పట్టణంలోని తోపుడు బండ్ల వ్యాపారులకు చెత్త బుట్టలను మెప్మా సిబ్బంది పంపిణీ చేశారు. వ్యాపారులు వ్యర్థాలను రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ పారవేస్తే రూ.1000ల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మెప్మా సిబ్బంది జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజులు పని కల్పించాలి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రాజా రఘువీర్

కౌతాళం: ఉపాధి కూలీలకు వంద రోజుల పని దినములు పూర్తి చేసేందుకు కార్యచరణ చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి రాజా రఘువీర్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్బారాజు అధ్యక్షతన అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గృహాలకు సంబంధించిన బిల్లులు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంపై చర్చించారు. పల్లె పండుగ, పంచాయతీ వారోత్సవాల్లో భూమిపూజ చేసిన సిమెంటు రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం గురించి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సమావేశంలో ఏపీఓ శంకర్, ఈసీ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో వివిధ శాఖల్లో పని చేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మగురుడు, వీరేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు నరసింహ, ఉరుకుందు, శేఖర్, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

పులికనుమ పైప్‌లైన్ పరిశీలన



పగిలిన పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ నిత్యానందరాజు

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం– సాతనూరు గ్రామాల మధ్యలో పులికనుమ రిజర్వాయర్ పైప్‌లైన్ లీకేజ్ కావడంతో దాదాపు 50 ఎకరాల పంట నీట మునిగి నష్టం వాటిల్లిన విషయం తెలసిందే. బుధవారం తహసీల్దార్ నిత్యానంద రాజు, ఏఓ రాజు, గురు రాఘవేంద్ర ప్రాజెక్ట్ ఏఈ ప్రేమ్‌లు ఘటనా స్థలానికి చేరుకుని పైప్‌లైన్ లీకేజ్ ప్రాంతం, పంట పొలాలను పరిశీలించారు. జంపాపురం పొలాల్లో స్టేజ్–1 నుంచి 2.61 కిలీ మీటర్లు వద్ద ఒక పైప్ పూర్తిగా పగిలిపోయిందన్నారు. జిల్లా ఉన్నత అధికారులకు నివేదిక పంపించి కొత్త పైపు ఏర్పాటు చేయించి యథావిధిగా నీటిని పంపింగ్ చేయిస్తామని ఏఈ ప్రేమ్ తెలిపారు. ఆర్ఐ తిక్కస్వామి, వీఆర్వో బాలస్వామి ఉన్నారు.

విద్యార్థులకు పోటీలు



విద్యార్థిని బహుమతి అందజేస్తున్న కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ షబానా అజ్మాన

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో ఆర్డీటీ కార్యాలయంలో ఏరియా పరిధిలోని 3, 4, 5వ తరగతి విద్యార్థులకు ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించారు. బుధవారం ముందుగా కార్యాలయంలో ఆర్డీటీ వ్యవస్థాపకుడు వీన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల స్పెషల్ ఆఫీసర్ షబానా అజ్మాన, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరి దేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థినీ, విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, ముగ్గుల పోటీలు, బంక మట్టితో బొమ్మలు, ప్రకృతిలో దొరకే వస్తువులతో నమూనా, పిక్చర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఓలు నాగేంద్ర, సిద్ధప్ప, నరసింహులు, వీరస్వామి, వీరేష్, భాస్కర్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ ఆధునికీకరణ



నూతన భవన నిర్మాణ పనులను చేస్తున్న కూలీలు

ఆదోని సెంట్రల్: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ కింద రైల్వే ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టింది. రూ.10.26 కోట్లతో ఆదోని రైల్వే స్టేషన్ ఆధనీకీకరణ పనులు కొనసాగుతున్నాయి. వృద్ధులు, వికలాంగులు, చంటి బిడ్డలు, బాలింతలు, గర్భిణుల సౌకర్యార్థం ఒక ప్లాట్‌ఫామ్ నుంచి మరోక ప్లాట్‌ఫామ్‌కు వెళ్లడానికి రూ. 30 లక్షలు వెచ్చించి 3 లిఫ్టులను ఏర్పాటు చేసి ప్రారంభించారు. అలాగే 2, 3 ప్లాట్‌ఫామ్‌లలో ప్రయాణికుల సౌకర్యార్థం రేకుల షెడ్డులను కూడా నిర్మించారు. రైల్వే స్టేషన్ మార్గంలో డివైడర్స్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు భవనాలను నిర్మిస్తున్నారు. నూతన ఎంట్రెన్స్‌తో ప్రయాణికులకు ఆహ్లాదకరమైన వాతవరణం కల్పించే దిశగా పనులను చేపడుతున్నారు.

తుంగభద్రమ్మ ఉరకలు



నాగలదిన్నె బ్రిడ్జి వద్ద నిండుగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది

నందవరం : తుంగభద్ర డ్యామ్ నుంచి నీరు నదికి విడుదల చేయడంతో బుధవారం ఉదయం వరద నీరు నాగలదిన్నెకు చేరుకుంది. టీబీ డ్యామ్‌లో 24 గేట్లు ఎత్తి 1.12 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వదిలారు. మండల పరిధిలోని నాగలదిన్నెలో పుష్కఘాట్‌ను వరద నీరు తాకింది. నదికి నీరు రావడంతో స్థానికులు ప్రవాహాన్ని తిలకించడానికి ఆసక్తిగా వచ్చారు. జాలర్లు, పశువుల కాపర్లు, మహిళలు నది తీరం వైపు వెళ్లకుండా అధికారులు అప్రమత్తం చేశారు. నది తీర ప్రాంతాల ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.